క్లుప్తంగా

సరుబుజ్జిలి విద్యార్థి ప్రతిభ



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న వినయ్‌కుమార్

సరుబుజ్జిలి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయిలో జీవవైవిధ్యం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచనా పోటీల్లో సరుబుజ్జిలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి పి.వినయ్ కుమార్ ద్వితీయస్థానం సాధించాడు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు బొత్స వెంకటరమణ మంగళవారం తెలిపారు. విద్యార్థిని అధ్యాపకులతోపాటు ఎంఈవో డి.బాలరాజు, సీఆర్ఎంటీ బెండి చిన్నారావు అభినందించారు.

ఎంపీడీవో బదిలీ



ఎంపీడీవోకు వీడ్కోలు పలుకుతున్న కార్యాలయ సిబ్బంది

సరుబుజ్జిలి: స్థానిక ఎంపీడీవో మేనక రత్నం మంగళవారం విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎన్నికల సమయంలో బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా సూపరింటెండెంట్ బి.ఎస్.వి.ప్రసాద్ వ్యవహరించనున్నారు. బదిలీపై వెళుతున్న మేనక రత్నంకు మండలపరిషత్ కార్యాలయం సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

నానో యూరియా వాడకంపై అవగాహన



నానో యూరియా వాడకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సారవకోట: నానో యూరియా ద్రావణం వాడకంపై నరసన్నపేట వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్ర భారతి, ఏఓ వెంకటరావులు రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. అవలింగి గ్రామంలో రైతు కింజరాపు గోవిందరావు పొలంలో డ్రోన్ సహాయంతో నానో యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. నానో యూరియా అన్ని పంటలకు నత్రజని, భాస్వరం అందించే సమర్థవంతమైన వనరు అని అన్నారు. నత్రజని, భాస్వరం లోపాలను సరిచేస్తోందన్నారు. పంట పెరుగుదల, నాణ్యతను పెంచి దిగుబడి పెంచుతుందన్నారు ఏఈఓ కంతయ్య, మాజీ సర్పంచ్ ధర్మారావు ఉన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వక్తలు అన్నారు. మండలంలోని లుకలాంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పరసరాల పరిశుభ్రత, అంటురోగాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కూర్మారావు, ఉపాధ్యాయులు, ఉర్లాం పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

షళంత్రిలో పశు వైద్యశిబిరం



పశువైద్య శిబిరంలో వెటర్నరీ విద్యార్థులు, సిబ్బంది

సరుబుజ్జిలి: పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ సీహెచ్ సుబ్రహ్మణ్యం కోరారు. మండలంలోని షళంత్రి పశువైద్యసబ్‌సెంటర్ ఆవరణలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పశువులకు గర్భకోశవ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందులు అందించినట్లు పశువైద్యాధికారి సతీష్ తెలిపారు. శిబిరంలో వెన్నెలవలస వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి, స్థానిక సర్పంచ్ బత్తిని వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు శివ్వాల సూర్యనారాయణ, కొవిలాపు చంద్రశేఖర్, అదపాక గౌరినాయుడు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పాతపట్నం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని, అప్పుడే కుటుంబాన్ని సంరక్షించుకుంటారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక బాలాజీనగర్–2లో కేఆర్‌పీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్లను మంగళవారం అందజేశారు. టైలరింగ్, టైపింగ్, ఎంబ్రాయిడరీ, కంప్యూటర్ రంగాల్లో మహిళలు శిక్షణ తీసుకొని స్వయం ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ కె.రమణ, పైల బాబ్జి, ఇప్పిలి ధనుంజయ, వెంకటరావు ఉన్నారు.

స్వాతంత్ర్య సందడి



బుక్‌షాపుల ముందు విక్రయాలకు ఉంచిన జెండాలు

స్వాతంత్ర్య వేడుకలకు సమయం సమీపిస్తోంది. ఒక్కరోజు మాత్రమే గడువు ఉండడంతో ఊరూరా సందడి వాతావరణం కనిపిస్తోంది. గురువారం జరగనున్న వేడుకల కోసం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. వీటిని అందంగా అలంకరించేందుకు కావాల్సిన వివిధ సామగ్రి విక్రయాలు మార్కెట్‌లో జోరందుకున్నాయి. జాతీయ జెండాలు, మూడురంగుల టోపీలు, రంగురంగుల కాగితపు పువ్వులను పుస్తకాల దుకాణాలు, ఖాదీబండారు షాపుల్లో విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు వస్తున్న విద్యార్థులు, కార్యాలయాల సిబ్బందితో దుకాణాలు కళకళలాడుతున్నాయి. అలాగే పోస్టాఫీసులో జాతీయజెండాను 25 రూపాయలకు అందుబాటులో ఉంచారు. -నరసన్నపేట



ఆకర్షణీయంగా క్లాత్ మూడు రంగుల జెండాలు



అందుబాటులో ఐలవ్ ఇండియా టోపీలు

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



పాతపట్నం: జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పాతపట్నం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీని పాతపట్నంలో నిర్వహించారు. కళాశాల, పాఠశాల విద్యార్థులు, స్థానిక నాయకులతో కలిసి పాతపట్నం బస్‌స్టాండ్ నుంచి కోర్టు కూడలి వరకు ర్యాలీ కొనసాగింది.

త్యాగాలు మరువలేనివి..

ఆమదాలవలస: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహానుభావుల త్యాగాలు మరువలేనివని తొగరాం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సీతారాం అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థలతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



ఆమదాలవలస: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

షార్ట్ ఫిల్మ్ పోటీల్లో ఆదర్శ పాఠశాలకు ద్వితీయస్థానం

పాతపట్నం: రాష్ట్ర జీవవైవిధ్య మండలి, పాఠశాల విద్య స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవవైవిధ్య పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై లఘు చిత్ర (షార్ట్ ఫిల్మ్) జిల్లా పోటీల్లో పాతపట్నం ఆదర్శ పాఠశాల ద్వితీయ స్థానం సాధించింది. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ రత్నకుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ ఈవో విజయకుమారి చేతులమీదుగా ఉపాధ్యాయుడు అప్పలరాజుకు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ నెల 10వ తేదీన విద్యార్థినులు కె.కల్యాణి, టి.రాధిక నటించి, నిర్మించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఉపాధ్యాయుడు అప్పలరాజును అధ్యాపకులు అభినందించారు.



డిప్యూటీ ఈవో విజయకుమారి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న అప్పలరాజు

మధ్యాహ్న భోజనం పరిశీలన

నరసన్నపేట: పాఠశాలల్లో విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పదార్థాలు రుచిగా అందించాలని ఎంఈఓ పేడాడ దాలినాయుడు అన్నారు. ముషిడిగట్టు గ్రామంలోని పాఠశాలను మంగళవారం సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తిన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని పెటాటలని, పరిశుభ్రతను పాటించాలి వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో దాలినాయుడు

మొక్కలు నాటివేత

సరుబుజ్జిలి: మొక్కలు అధికంగా నాటి వాటిని సంరక్షించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర తెలిపారు. నషాముక్త భారతదేశం దిశగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో రమేష్‌సాహు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సిబ్బంది

వంద రోజులు లక్ష్యంగా పనులు చేపట్టాలి



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న ఏపీడీ రాధ

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగిఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజులు లక్ష్యంగా పనులు చేపట్టాలని డ్వామా ఏపీడీ పి.రాధ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉపాధి సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చెరువు, కాలువ గట్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పండ్ల మొక్కలు పెంచేందుకు ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి వారితో మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి అంచనాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఏపీఓ వి.శ్రీదేవి, ఈసీ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



సారవకోట: సిబ్బందితో సమీక్షిస్తున్న అధికారులు

సారవకోట: వంద రోజుల్లో చేపట్టనున్న పనులపై మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ రాంబాబు, తహసీల్దార్ విజయలక్ష్మిలు పలుశాఖల సిబ్బందితో సమీక్షించారు. అలాగే సచివాలయ సిబ్బంది ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగు పర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, మంచినీటి సమస్య, జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంఈఓ ఎంపీ రమణ, సీడీపీవో హెచ్‌కే కామాక్షి ఉన్నారు.

17 నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

హిరమండలం: ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలను చైర్మన్లు, సెక్రటరీలు, సీఆర్ఎంటీలు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తూరు, హిరమండలం మండలాల్లో 50 శాతం చొప్పున సర్దుబాటు చేసుకుంటుందన్నారు. ప్రైమరీ సమావేశాలు ఎనిమిది నెలలు పాటు ప్రతీనెలా విధిగా నిర్వహించాలన్నారు. విద్యాశాఖ సూచించిన షెడ్యూల్ ప్రాప్తికి అజెండాను అనుసరించి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయులందరూ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యేలా చైర్మన్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు

కేజీబీవీ సందర్శన



విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి జోత్స్న

పొందూరు: లోలుగు గ్రామంలోని కేజీబీవీని మంగళవారం పొందూరు కోర్టు జడ్జి బి.జ్యోత్స్న సందర్శించారు. రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు కేజీబీవీని పరిశీలించారు. తరగతి, వసతి గదులను పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్నేహపూర్వక న్యాయసేవలు, వాటి రక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాలకు రూ. లక్ష విరాళం

సారవకోట: మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థి వాక రాంబాబు ప్రతిభ పురస్కారాల కోసం లక్ష రూపాయలను అందజేశారు. ఈ మొత్తాన్ని 2025 సంవత్సరం నుంచి ఆ పాఠశాలలో చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థలకు ప్రతిభ పురస్కారాలు అందించేటట్లు చర్యలు తీసుకోవాలని హెచ్ఎం మన్మథరావును కోరారు.

నేడు కొత్తూరు మండల సమావేశం

కొత్తూరు: కొత్తూరు మండల పరిషత్ సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఏవో బసవ రాంబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రం ఎల్.ఎన్.పేటలో పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. 1999లో ఎల్.ఎన్.పేట మండలం ఏర్పాటు చేశారని.. ఇప్పటి వరకు పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయలేదని వివరించారు. రెండు మండలాలకు ఒకే పోలీసు స్టేషన్ ఉండటం వలన విధులు నిర్వహించేందకు పోలీసులతో పాటు శాంతి భద్రతల విషయంలో ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని మంత్రి ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

బోరుకు మరమ్మతు

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులోని కాలేజీ రోడ్డు హడ్డుబంగి గెడ్డకు ఆనుకొని ఉన్న బోరు పాడైంది. ఈ విషయాన్ని సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. స్పందించిన నాయకులు మంగళవారం మెకానిక్‌లను రప్పించి బోరును బాగు చేయించడంతో సమస్య పరిష్కారమైంది.

చదువుపై దృష్టి పెట్టండి

- విద్యార్థులకు ఏఎస్పీ ప్రేమకాజల్ సూచన

నరసన్నపేట: విద్యార్థులు ఒక వైపు చదువుపై దృష్టి పెడుతూ మరో వైపు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని.. అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించగలరని జిల్లా ఏఎస్పీ ప్రేమకాజల్ అన్నారు. అందుబాటులోనికి వచ్చిన సాంకేతికను మంచికి వినియోగించాలని కోరారు. అలాగే సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నరసన్నపేటలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఉన్నత వ్యక్తుల గురించి తెలుసుకొని వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సాంకేతిక విప్లవం నేపథ్యంలో క్షణాల్లో అన్ని విషయాలు తెలుస్తున్నాయన్నారు. సాంకేతికతలో మంచిని మాత్రమే స్వీకరించాలని చెప్పారు. డిగ్రీ పట్టాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా చాలా ముఖ్యమన్నారు. నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలను సాధించగలమన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. న్యాయపరమైన సెక్షన్లు, చట్టాలు మారుతుండడంతో శిక్షలు ఎక్కువ పడుతున్నాయని చెప్పారు. దర్యాప్తు పద్ధతులు సైతం మారాయన్నారు. లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని.. తల్లిదండ్రులకు శోకం మిగల్చవద్దన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని ఉత్తమ భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని అన్నారు.

కార్యక్రమంలో సీఐ జె.శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రేమకాజల్

బాలికల రక్షణపై దృష్టిసారించాలి

- కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత

జలుమూరు: బాలికల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోటబొమ్మాళి సివిల్ జడ్జి బీఎం ప్రసన్నలత అన్నారు. అలాగే విద్యార్థులే లక్ష్యంగా మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల రవాణ జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం జలుమూరు కేజీబీని సందర్శించి అక్కడ మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యతతోపాటు వంట, తరగతి గదులు పరిశీలించి మాట్లాడారు. ప్రధానంగా అపరిచిత వ్యక్తులతో విద్యార్థులు మాట్లాడటం, వారితో పరిచయం మంచిది కాదని వివరించారు. గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వారంలో శుక్రవారం పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని ఎస్‌ఓ యశోద తెలిపారు. జలుమూరులోని భవిత కేంద్రాన్ని కూడా జడ్జి సందర్శించారు. ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసరావు, ఎంఈవోలు బి.మాధవరావు, బీఎం ప్రసాదరావు, స్థానిక హెచ్ఎం మెండ రామారావు ఉన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

స్థలపరిశీలన

హిరమండలం: మండలానికి మంజూరైన పీఎం జన్మన్ వసతి గృహాల నిర్మాణానికి స్థల సేకరణ పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కె.రాంబాబు తెలిపారు. జిల్లా సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ పూడి జనార్దనరావుతో కలిసి వసతి గృహాల నిర్మాణానికి సేకరించిన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. మండలంలోని సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, సీది గ్రామాలకు రెండు వసతి గృహాలు మంజూరయ్యావన్నారు. అయితే ఆయా గ్రామాల్లో భూసేకరణ చేసేందుకు ప్రభుత్వ భూమి లేకపోవడంతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి సంబంధించి గులుమూరు రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్ 133లో 20 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించామని చెప్పారు. అలాగే సీది గ్రామానికి మంజూరైన వసతి గృహానికి సంబంధించి గొడియపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 76లో సుమారు ఎకరా వరకు ప్రభుత్వ భూమిని గుర్తించి స్థలసేకరణ చేసినట్లు పేర్కొన్నారు. రెండు వసతి గృహాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తిచేసినట్లుగా ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ గోవిందరావు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.



స్థల పరిశీలనలో అధికారులు

యాజమాన్య పద్ధతులు కీలకం

నరసన్నపేట: రైతులు ఖరీఫ్ సీజన్‌లో వరిలో ఎరువుల యాజమాన్య పద్ధతులు అవలంబించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి కె.సునీత అన్నారు. మండలంలోని ఉర్లాం గ్రామంలో మంగళవారం పొలంబడి నిర్వహించారు. దీంట్లో భాగంగా 25 ఎకరాల్లో 35 మంది రైతులతో ఒక గ్రూపును ఏర్పాటు చేశామన్నారు. 14 వారాల పాటు వివిధ యాజమాన్య పద్ధతులను పొలంబడి కార్యక్రమం ద్వారా తెలియచేస్తామన్నారు. అధిక ఎరువుల వినియోగం మంచిదికాదని అన్నారు. అలాగే పురుగు మందులు విచ్చలవిడిగా వాడవద్దని.. దీని వలన పైర్లకు మేలు చేసే కీటకాలు నశించే ప్రమాదం ఉందన్నారు. రైతులు గమనించి సరైన పద్ధతిలో అవసరమైన మోతాదులోనే పురుగు మందులు వాడాలన్నారు. కలుపు నివారణా పద్ధతులను రైతులకు తెలియజేశారు. ప్రతీ గురువారం పొలం బడి నిర్వహిస్తామని రైతులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నడిమింటి శాంతారావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సునీత

సంక్షిప్తంగా..

వితంతువులకు పింఛన్ అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బి.జ్యోత్స్న

పొందూరు: అర్హులైన వితంతు మహిళలకు పింఛన్ అందజేయాలని పొందూరు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, స్థానిక కోర్టు జడ్జి బీ.జ్యోత్స్న అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో వితంతు పింఛన్ పథకంపై మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వితంతు పింఛన్ పొందేందుకు గల అర్హతలు, దరఖాస్తు చేసుకునే విధానం, సమర్పించాల్సిన పత్రాల గురించి వివరించారు. అవసరమైతే న్యాయసేవా సంస్థను ఆశ్రయించాలని సూచించారు. గ్రామ స్థాయిలోని సచివాలయాల కార్యదర్శులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో లాయర్లు మంజుల, అశోక్, రాము, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పాతపట్నం: మండలంలోని పెద్దలక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దలక్ష్మీపురం, వెంకటాపురం, రామచంద్రపురం గ్రామాలకు రహదారితో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో అన్నెపు ఉమామహేశ్వరరావు, బైరాగినాయుడు, రామారావు, వెంకటరమణ ఉన్నారు.

పంట నమోదు తప్పనిసరి



సైలాడలో పొలాలు పరిశీలిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: రైతుల తమ పంటలను ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఆమదాలవలస వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు అన్నారు. సైలాడ, టి.జొన్నవలస గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను మంగళవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. అలాగే వాటి పరిధిలోని పంట పొలాలను పరిశీలించి రైతులు సూచనలు చేశారు. రైతులు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు, రాయితీలు పొందాలంటే ఈక్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. వ్యవసాయ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వరుసక్రమ నాట్లుతో బహుళ ప్రయోజనాలు



వరుస క్రమంలో నాట్లు వేయిస్తున్న సిబ్బంది

కొత్తూరు: వరి నాట్లను వరుస క్రమంలో వేయడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాష్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో కె.ఫాల్గుణరావు పొలంలో వరుస క్రమంలో వరినాట్లు మంగళవారం వేయించారు. ఇలా చేయడం వల్ల దుబ్బులకు గాలీవెలుతురు బాగా తగలడం ద్వారా పంట దిగుబడి బాగుంటుందన్నారు. వ్యవసాయ సహాయకులు వసంత, దివాకర్ ఉన్నారు.